నమస్తే తెలంగాణ
సిద్ధిపేట

I | హైదరాబాద్, మంగళవారం 1 అక్టోబర్ 2024 | SIDDIPET

ఇప్పూలో శిక్షణ పొందిన విద్యార్థిని మాటలు వింటున్న మాజీమంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటలో కార్మికుల కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఇందిరానగర్ స్కూలంటే ఇష్టం

- 10 జీపీఏ సాధిస్తే ఐపాడ్ ఉచితంగా ఇస్తా..
- అన్ని విద్యాసంస్థలు సిద్దిపేటకు తీసుకొచ్చాం..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 30: సిద్దిపేటలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల అంటే తనకెంతో ఇష్టమని, ఉపాధ్యాయులంటే ఇంకా ఇష్టమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇప్పూలో శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ పాఠశాలను గొప్పగా తీర్చిదిద్ది రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చారన్నారు. ఇక్కడి విద్యార్థులు ఇప్పూలో ఫారెన్ లాంగ్వేజీలు నేర్చుకొని అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నట్లు తెలిపారు. నాట్కో వారు రూ.40 లక్షలు ఇస్తున్నారని, అవసరమైన పనులు చేసుకోవడంతోపాటు అదనపు తరగతి గదులు నిర్మిస్తామని చెప్పారు. పీఎం శ్రీ పథకం కింద ఈ పాఠశాల ఎంపికైందని, కేంద్రం నుంచి అదనపు నిధులు వస్తాయని తెలిపారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులందరికీ ఐపాడ్ ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, సాయంత్రం విద్యార్థులందరికీ అల్పాహారం ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని విద్యాసంస్థలను సిద్దిపేటకు తెచ్చామని, మెడికల్ కాలేజీకి అనుబంధంగా నాలుగు కళాశాలలు నడుస్తున్నాయని తెలిపారు. ఇందిరానగర్ పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులకు కూడా ఇప్పూ ద్వారా ఫారిన్ లాంగ్వేజీలు నేర్పించే ఏర్పాటు చేస్తా అన్నారు. స్పానిష్ భాష నేర్చుకుంటే విద్యార్థుల భవిష్యత్ గొప్పగా ఉంటుందని, అనేక దేశాల్లో స్పానిష్ భాష మాట్లాడుతారని తెలిపారు. గొప్పగా బోధించడంతోనే ఈ పాఠశాలలో అడ్మిషన్ల కోసం 1000 మంది దరఖాస్తు చేసుకోవడం గొప్ప విషయమని హరీశ్‌రావు పేర్కొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్తు

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్
- హుస్నాబాద్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

హుస్నాబాద్, సెప్టెంబర్ 30: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం హుస్నాబాద్‌లోని మినీస్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు జిల్లాల స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు హుస్నాబాద్‌లో నిర్వహించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, దొడ్డి శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు వెన్న రాజు, మహేందర్‌రెడ్డి, కృష్ణ, హ్యాండ్‌బాల్ పోటీల ఇన్‌చార్జిలు రఫత్ ఉమర్, రాజశేఖర్, పీడీ సుజాత, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకట్

వెనకడుగుకు కారణమేందో..?

నల్లవాగు 20మీటర్లకు మార్కింగ్ చేసిన సర్వే

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం శిల్పా వెంచర్‌లో నిలిచిన కూల్చివేతలు

- ఈనెల 27న సర్వే చేసిన అధికారులు
- కూల్చివేతలు నిలిపివేయడంతో అనుమానాలు
- పావు మీటరు కూడా కదలని తవ్వకాలు

సంగారెడ్డి, సెప్టెంబర్ 30: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో శిల్పా వెంచర్ ఆక్రమణలకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చేపట్టిన కూల్చివేతలు అకస్మాత్తుగా నిలిపివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదాశివపేట మండలం నాగ్సాన్‌పల్లిలో పొలాల గుండా నల్లవాగు ప్రవహిస్తుంది. జాతీయ రహదారి పక్కగా పారే నల్లవాగును శిల్పా వెంచర్ వాగు ప్రవాహం అడ్డుకునేలా అక్రమ నిర్మాణాలు చేపట్టింది. నల్లవాగు వెడల్పు 20 మీటర్లు ఉండగా వాగుకు ఇరువైపులా తొమ్మిదిమీటర్ల చొప్పున బఫర్ ఉంది. శిల్పా వెంచర్ మధ్యనుంచి నల్లవాగు ప్రవహిస్తుండంతో వెంచర్ యాజమాన్యం వాగు ప్రవాహాన్ని అడ్డగించి పార్కు ఇతర నిర్మాణాలు చేపట్టింది. ఫలితంగా వాగు వెడల్పు కుచించుకుపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి ప్రవహించింది. వాగు కుచించుకుపోవటంతో వరద నీరంతా వెంచర్‌లోకి రావడంతో పాటు పొలాల్లోకి ప్రవహించింది. పక్కనే ఉన్న 65వ నెంబరు జాతీయ రహదారిపైనా నల్లవాగు వరద ప్రవహించి వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. నల్లవాగు వరదతో పంటలు మునిగిపోవడంతో రైతులు నీటిపారుదల, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నల్లవాగును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వాగు కుచించికుపోయిందని, సహజసిద్ధంగా పారాల్సిన జలాలు పొలాల్లోకి వస్తున్నాయని, వెంటనే అక్రమ నిర్మాణాలు తొలిగించాలని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు ఈనెల 27న రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్, డీటీసీసీ అధికారులు సంయుక్త సర్వే చేశారు. నాలా ఆక్రమణకు గురైనట్లు సర్వేలో అధికారులు గుర్తించారు. ఎంత వరకు ఆక్రమణకు గురైంది మార్కింగ్ చేశారు. దీంతో ఉలిక్కిపాటుకు గురైన వెంచర్ నిర్వాహకులు అడ్డుకునేందుకు యత్నించారు. పోలీసులు కేసులు పెడతామని హెచ్చరించడంతో యాజమాన్యం సైలెంట్ అయ్యింది. అంతకుముందు అధికారులు వచ్చి సర్వే చేసి మార్కింగ్ చేస్తే సరిపోతుందని గాంభీర్యాలు పలికిన యాజమాన్యం మార్కింగ్ ప్రకారం తామే నిర్మాణాలను తొలిగించి ప్రభుత్వ నిబంధనల వరకు కూల్చివేస్తామని చెప్పి మొఖం చాటేయడంతో అధికారులే యంత్రాలను తెచ్చి కూల్చివేతల పనులు ప్రారంభించారు. ఈనెల 28న జేసీబీ యంత్రాలతో వాగుకు రెండువైపులా మార్కింగ్ చేసినంత వరకు కాలువలు తవ్వారు. నిబంధనల మేరు బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలు తొలిగించాల్సి ఉండగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయ లోపమా లేక రాజకీయ ఒత్తిళ్లు కారణమో తెలియదు కాని శిల్పావెంచర్‌లో అక్రమ నిర్మాణాల తొలిగింపు నిలిచిపోయింది. నిబంధనల మేరకు వ్యవహరించాల్సిన అధికారులు మిన్నుకుండి పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిల్పా వెంచర్‌లోని అక్రమ నిర్మాణాలను తొలిగించి నల్లవాగును రక్షించాలని రైతులు కోరుతున్నారు.

ఇటీవల సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో జేసీబీలతో మార్కింగ్ చేసిన స్థలంలో టెంచ్‌లు తీస్తున్న అధికారులు

రెవెన్యూశాఖ నిర్లక్ష్యంపై అనుమానాలు..

శిల్పా వెంచర్‌లో ఆక్రమణలకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఎంత వరకు కూల్చివేయాలని ఆదేశిస్తే అంత వరకు తొలిగిస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టంచేశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు వాగు విస్తీర్ణం 20మీటర్లు, రెండు వైపులా బఫర్ జోన్‌లో 9 మీటర్ల చొప్పున ఖాళీ స్థలం ఉండాలని సూచించారు. సర్వే అధికారులు ఆ ప్రకారం సర్వే చేసి వాగుకు రెండువైపులా మార్కింగ్ చేసి రెవెన్యూ శాఖకు కూల్చివేత పనులు అప్పగించారు. మొదటి రోజు శనివారం వాగు ఆక్రమణలపై కూల్చివేతలు ప్రారంభించి సాయంత్రం వరకు వాగు పొడవునా సర్వే అధికారుల మార్కింగ్ చేసిన వరకు టెంచ్‌లు ఏర్పాటు చేశారు. తర్వాత ఆదివారం కావడంతో పనులు నిలిపివేశారు. మరుసటి రోజు సోమవారం కూల్చివేతలు మొదలు పెట్టాల్సిన అధికారులు ఆ పక్కకు రాకపోవడంపై అధికారుల తీరుపై ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఇకపై శిల్పా వెంచర్ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

సర్వే పూర్తి కాలేదు..అధికారులు రాలేరు..

నల్లవాగు కింద భాగంలో ఉన్న భూయజమాని పట్టాభూమి కొంతభాగం తక్కువగా ఉన్నట్లు మాదృష్టికి తెచ్చారు. శిల్ప వెంచర్ యాజమాన్యానికి పట్టాభూమి కోల్పోతున్నామని ఇరువురికి ఇబ్బందులు లేకుండా ల్యాండ్ సర్వే చేసి వాగును పూర్తిస్థాయిలో విస్తరించాలని కోరారు. సర్వే చేసేందుకు అధికారులు రాగానే సర్వే చేయించి ఇద్దరు భూయాజమ్యాలకు పట్టా భూమి తక్కువ లేకుండా సర్వే చేసిన తర్వాత వాగును పూర్తిస్థాయిలో విస్తరిస్తాం. వెంచర్ యాజమాన్యం అధికారులకు సహకరించేలా కింద భాగంలో ఉన్న ఫామ్‌హౌస్ యజమానితో నేను చర్చించి వాగు విస్తరణకు కోరాను. నామాటపై నమ్మకం ఉంచి వెంచర్ నుంచి 65వ జాతీయ రహదారి వరకు వాగును విస్తరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. కేవలం సర్వేతోనే కూల్చివేతలు ఆగిపోయాయి. సర్వే పూర్తికాగానే పనులు పునఃప్రారంభిస్తాం.

– సరస్వతి, తహసీల్దార్, సదాశివపేట

ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 30: ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను పరామర్శించడానికి కాంగ్రెస్ మంత్రులు,ఎమ్మెల్యేలకు సమయం లేదని, వారి బతుకులను కాంగ్రెస్ సర్కారు ఆగం జేసిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు.సోమవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల కో ఆపరేటివ్ సంస్థ ఆధ్వర్యంలో ఆటో కార్మికులకు యూనిఫామ్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆటో కార్మికులు సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం మెడలు వంచి ఆటో కార్మికుల సంక్షేమాని కృషి చేస్తానన్నారు. 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదన్నారు. సిద్దిపేట ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ దేశానికే ఆదర్శమన్నారు. ఈ సొసైటీ ద్వారా రూ.2.10 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్మికులకు రూ.2లక్షల బీమా సౌకర్యం కల్పించామన్నారు.26మంది ఆటో కార్మికులు చనిపోతే నూ.2లక్షల చొప్పున బీమా పరిహారం అందజేసినట్లు తెలిపారు. 63 మంది పెండ్లిలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ కోసం తన ఇంటిని తాకట్టు పెట్టినట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు. సొసైటీ తరపున పెట్రోల్‌బంకు ఏర్పాటు చేసి దాని ద్వారా వచ్చే ఆదాయం కార్మికులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఆటో కార్మికులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులకు రూ.2లక్షల చెక్కును ఆందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాల సాయిరాం పాల్గొన్నారు.

గురువులంటే కేసీఆర్‌కు ఎంతో గౌరవం

సిద్దిపేటలో ఉద్యోగ విరమణ పొందిన శుభాకర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న హరీశ్‌రావు

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో 73 శాతం ఫిట్‌మెంట్ అందించాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 30 : ప్రపంచ తెలుగు మహాసభల్లో కేసీఆర్ తన గురువుకు సాష్టాంగ నమస్కారం చేశారని, ఒక గురువుకు ఇంతకంటే కావాల్సింది ఏమీ ఉండదని, గురువులంటే కేసీఆర్‌కు ఎంతో గౌరవమని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో ప్రభుత్వ ఫిజికల్ డైరెక్టర్ శుభాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అన్ని వర్గాల ప్రజలు గౌరవించేది ఉపాధ్యాయ వృత్తి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు కూడా రైతుబంధు, రుణమాఫీ పథకాలు అమలయ్యాయని, ఇప్పుడు వాటితోపాటు పీఆర్సీలు, డీఏ, ఫిట్‌మెంట్లు రావడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో 73 శాతం ఫిట్‌మెంట్ అందించామని తెలిపారు. మార్చిలో రిటైర్‌మెంట్ అయిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు రిటైర్‌మెంట్ డబ్బులు, గ్రాట్యుటీ, జీపీఎఫ్, ఎల్ఐసీ డబ్బులు రాలేదన్నారు.

దౌర్జన్యాలను ధిక్కరించిన ధీశాలి దాశరథి

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

సిద్దిపేటలో మరసం వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 30: నిజాం నిర్బంధాలను, రజాకార్ల దౌర్జన్యాలను ధిక్కరించిన త్యాగమూర్తి దాశరథి అని ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేటలో ఆదివారం రాత్రి వరకు జరిగిన మంజీరా రచయితల సంఘం 38వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొని దాశరథి కవితా చైతన్యం అనే అంశంపై ఆయన మాట్లాడారు. కల్లోలాలపై, జాగీర్దారుల హింసపై తిరుగుబాటు చేసిన సాహసికుడు, భావికుడు, పండితుడు, విప్లవకారుడు, సామ్యవాద పక్ష పాతి దాశరథి అన్నారు. నిజామాబాద్ జైల్లో చిత్రహింసల కొలిమిలో గాయాలు సలుపుతుంటే పద్యాలు చెప్పడం, గోడలపై పద్యాలను బొగ్గుతో రాయడం ఆయనకు మాత్రమే చెల్లిందన్నారు. వరంగల్‌లో సురవరం ప్రతాప్‌రెడ్డి నిర్వహించిన కవి సమ్మేళనం వేదికను రజాకార్లు దహనం చేసినప్పుడు బూడిద కుప్పలపై నిలుచుని నిజాం వ్యతిరేక కవిత్వాన్ని సంధించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. 32 పుస్తకాలు రాసి తెలంగాణ సాహిత్యంలో దాశరథి చెరగని ముద్ర వేశాడని కొనియాడారు. బిరుదురాజు రామరాజు పరిశోధనలు, సాహిత్య అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం మాట్లాడారు. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు జానపదాన్ని సాహిత్యంగా ముద్ర వేయడంలో రామరాజు చేసిన కృషి అద్భుతమన్నారు. ఆరుద్ర స్ఫూర్తి అంశంపై సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందినీ సిధారెడ్డి మాట్లాడుతూ..మధ్యతరగతి బతుకుల ఆక్రోశం, తెలంగాణలో వెట్టి చాకిరి, మహిళలపై జరిగిన ఘోర ఆకృత్యాలు ఆరుద్ర సాహిత్యంలో ప్రతిఫలించాయన్నారు. తెలంగాణ పట్ల అపారమైన ప్రేమ ఆయనకు ఉండేదన్నారు. వేడుకల్లో భాగంగా జరిగిన కవి సమ్మేళనం పలువురిని అలోచింపజేసింది. ఈ మేరకు పలువురు కవులు తమ గళాలను ప్రజా సమస్యలపై సంధించారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 30: ఆశవర్కర్ల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురా లు కనకవ్వ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..20 ఏండ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభు త్వం నుంచి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆశవర్కర్లకు నెలకు పద్దెనిమిది వేలు జీతం, ఉద్యోగ భద్రత, యాక్సిడెంట్, సహజ మరణానికి ఎక్స్‌గ్రేషియా, హెల్త్ కార్డు, కొత్త ఆశల నియామకం, అర్హత కలిగిన ఆశలకు ప్రమోషన్, ప్రభుత్వ పథకాల వర్తింపు, పెండింగ్ ఇన్సెంటివ్స్‌పై డిమాండ్లను, సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చదువుతోనే దేశాభివృద్ధి

- ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఆర్సీపురంలో రూ.1.23కోట్లతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభం

ఆర్సీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు పుష్పానగేశ్, సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 30: ప్రతి ఒక్కరికి చదువు అందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆర్సీపురం డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'మనఊరు..మనబడి' కార్యక్రమంలో భాగంగారూ.1.23 కోట్లతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ పుష్పానగేశ్‌తో కలిసి ఎంపీ రఘునందన్‌రావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను వారు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమవుతుందన్న స్వామి వివేకానంద సూక్తికి అనుగుణంగా ప్రతి విద్యార్థి భవిష్యత్తుని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశామన్నారు. పాఠశాల నిర్మాణానికి జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సీఎస్ఆర్ నుంచి రూ.40లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, బల్దియా ఉపకమిషనర్ సురేశ్, పంచాయతీరాజ్ డీఈ సురేశ్, ఎంఈవో పీపీరాథోడ్, అంజయ్య, కుమార్ గౌడ్, పరమేశ్, గోవింద్, ఇలేశ్, నర్సింగ్, మల్లేశ్, సంతోష్, బలరాం పాల్గొన్నారు.

గురువన్నపేటలో మరోసారి ఉద్రిక్తత

నిందితుడి ఇంటిపై దాడిచేసిన వారిని తీసుకెళ్తున్న పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

కొమురవెల్లి, సెప్టెంబర్ 30: సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలో బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు ఎండీ షార్బుద్దీన్ ఇంటిపై దాడిచేసిన వారిని గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు వాహనంలో తరలిస్తున్న క్రమంలో సోమవారం ఒక్కసారిగా గ్రామస్తులు పోలీస్ వాహనానికి అడ్డు తగిలారు. దీంతో పోలీసులకు గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ కలుగజేసుకొని వారిని వదిలిపెట్టడంతో గ్రామస్తులు శాంతించారు.అనంతరం సిద్దిపేట డీసీపీ మల్లారెడ్డి గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలికపై లైంగిక దాడి జరగడంతోనే ఆవేశంతో దాడి చేశామని, ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని, గ్రామస్తులపై పెట్టిన కేసును కొట్టివేయాలని డీసీపీని కోరారు. దీంతో డీసీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ చట్టానికి ఎవరూ చుట్టం కాదని, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాము రెండు రోజుల నుంచి నిద్ర లేకుండా పని చేస్తున్నామని, గ్రామస్తులు సహకరించాలని కోరారు. గ్రామస్తులపై పెట్టిన కేసుల గురించి ఉన్నతాధికారు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్ గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పరామర్శించారు. నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ హైడ్రాపై పెట్టిన దృష్టి మహిళల రక్షణపై పెట్టడంలేదని విమర్శించారు. బాలిక కుటుంబాన్ని హిందూవాహిని కార్యకర్తలు పరామర్శించారు. కార్యక్రమంలో జనగామ బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి, ఉమారెడ్డి, బీజేవైఎం ప్రధానకార్యదర్శి సురేశ్‌గౌడ్, కొమురవెల్లి బీజేపీ మండలాధ్యక్షుడు నాగరాజు, బ్రహ్మండ్లపల్లి బాబు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిద్దిపేట డీసీపీ మల్లారెడ్డి

సంగారెడ్డిలో హైడ్రా గుబులు

- జగ్గారెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో జనంలో ఆందోళన
- సంగారెడ్డిలో ఇది వరకే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఇండ్లకు మార్కింగ్
- నోటీసుల జారీకి సిద్ధమవుతున్న అధికారులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి ప్రజల్లో హైడ్రా గబులు నెలకొంది. మాజీఎమ్మెల్యే జగ్గారెడ్డి హైడ్రాపై చేసిన వ్యాఖ్యలతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. జగ్గారెడి వ్యాఖ్యలకు బలం చేకూర్చేలా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల్లో నిర్మాణాలు ఉన్న యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు సన్నద్ధవుతున్నట్లు తెలిసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పలు వార్డుల్లో ఇండ్లు నీట మునిగాయి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించుకున్న ఇండ్లు జలమయమయ్యాయి. మహా బూబ్‌సాగర్ పెద్దచెరువు, దూద్‌బాయి చెరువు, మాసాయికుంట, ఎర్రకుంట చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ప్రజలు ఇండ్లు నిర్మించుకుని ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రెవెన్యూ కాలనీ, శ్రీచక్రకాలనీతోపాటు భగత్‌సింగ్‌నగర్, సోమేశ్వర్ వాడ, కల్వకుంట, మార్క్స్‌నగర్‌లోని పలు ఇండ్లలోకి నీళ్లు వచ్చాయి. నాలాలను కబ్జా చేసి అక్రమంగా ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీంతో మూడు శాఖల అధికారులు సంయుక్త సర్వేలు జరిపి రెవెన్యూ కాలనీ, శ్రీచక్రకాలనీ, భగత్‌సింగ్‌నగర్, సోమేశ్వరవాడ, కల్వకుంట, మార్క్స్‌నగర్‌లలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో మార్కింగ్ చేయడంతోపాటు యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. హైడ్రా పేరుతో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో, కొండాపూర్ మండలం మల్కాపూర్ చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో నిర్మించి భవనాన్ని అధికారులు డిటోనేటర్లు అమర్చి పేల్చివేయడం వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సంగారెడ్డి, కంది, కొండాపూర్ మండలాల్లో మూడు విద్యాసంస్థలకు నోటీసులు ఇచ్చేందుకు సన్నద్ధమతున్నారు. ఈ విషయమై సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

అర్జీలు వేగంగా పరిష్కరించాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 30: ప్రజావాణి అర్జీలను వేగంగా పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. మొత్తం 60 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై దృష్టిసారించి పరిష్కరించాలన్నారు. అన్ని గురుకులాలు, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు క